## క్లుప్తంగా

### ఘనంగా నేషనల్ బర్డ్స్ డే



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రామకృష్ణ

పాలకొల్లు సెంట్రల్: సెల్‌ఫోన్స్ రేడియేషన్ వల్ల పక్షులు అంతరించిపోతున్నాయని వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.రామకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ బర్డ్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పక్షులను రక్షించుకోవాలంటే బయో డైవర్సిటీని సమతుల్యం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు వై.విజయ్‌కుమార్, సీహెచ్ రవికుమార్, కె.శివకృష్ణ, జ్యోత్స్న, హెప్సిబా రాణి తదితరులు పాల్గొన్నారు.

### రోగికి వసుధ ఆర్థిక సహాయం



రోగి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న పెన్మెత్స బుద్ధరాజు

పాలకొల్లు అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న వెంప గ్రామానికి చెందిన కలిదిండి అన్నపూర్ణకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ ఆర్థిక సహాయాన్ని గురువారం వసుధ ఫౌండేషన్ పాలకొల్లు కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు చేతుల మీదుగా అన్నపూర్ణ బంధువు కృష్ణంరాజుకి అందజేశారు. ఆపదలో వున్న అన్నపూర్ణకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేసిన ఫౌండేషన్ చైర్మన్ వెంకట్రామరాజుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### నవోదయ ఎంట్రన్స్ పుస్తకాల పంపిణీ



నవోదయ ఎంట్రన్స్ పుస్తకాలతో విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: నవోదయ హైస్కూల్లో ఆరో తరగతిలో చేరడానికి నిర్వహించే పరీక్షకు ఉపయోగపడే నవోదయ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఏవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక జీవీఎస్‌వీఆర్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో దాత భీమవరం ఆర్డీఓ దాసి రాజు అందించిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ నవోదయ ఎంట్రన్స్ పుస్తకాలను 5వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యకు పునాదులు వేసుకోవాలన్నారు. నవోదయ పాఠశాలలో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ టి.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

### బియ్యం నాణ్యతపై ఆందోళన

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బీఆర్ఎంవీఎం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసే మధ్యాహ్న భోజన పథకంలో వినియోగిస్తున్న బియ్యం నాణ్యత ఆందోళన కలిగిస్తుందని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కెల్ల పెద్దిరాజు ఆరోపించారు. గురువారం పాఠశాలలో వంట షెడ్‌లో ఉన్న బియ్యం స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వంట షెడ్‌ను పరిశీలించామన్నారు. స్టాక్ రూములో 50 కిలోల బస్తాలు సుమారు 500 వరకూ ఉన్నాయని తెలిపారు. ఈ బియ్యం నాణ్యంగా లేవన్నారు. దీంతో హెచ్‌ఎంను ప్రశ్నించగా ఆమె సమాధానం చెప్పకపోవడంతో తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన బియ్యం మారుస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో చల్లా ముత్యం, గెద్దాడ రాజు, అన్నాబత్తుల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు వెంకన్న ఆలయంలో లక్ష తులసి పూజ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష తులసి పూజ నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు తెలిపారు. ధనుర్మాసం పూజలు పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు గోపూజ, గ్రామోత్సవం, విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం, పంచామృత మండపారాధన, మూలవరులకు అభిషేకం, అలంకరణ అనంతరం స్వామివారికి లక్ష తులసి పూజ, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు కృష్ణ చైతన్య పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు.

# చెప్పాడంటే..చేస్తాడంతే

- మాటఇస్తే మడమ తిప్పని సీఎం వైఎస్ జగన్
- మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పోడూరులో కొత్త లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పోడూరు: మాట ఇస్తే మడమతిప్పని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, చెప్పారంటే కచ్చితంగా చేస్తారని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పోడూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కొత్తగా పింఛను మంజూరైన లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ ముందుగా ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వృద్ధుల పింఛన్‌ను రూ.2750కు పెంచడంతో అవ్వతాతల మోముల్లో ఆనందం చూస్తున్నామన్నారు. కరోనా కష్టకాలంలోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలును యథావిధిగా కొనసాగించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, మండల కన్వీనర్ పిల్లి నాగన్న, వైస్ ఎంపీపీలు ఇందుకూరి సీతారామరాజు, గుబ్బల సత్యనారాయణ, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, ఎంపీటీసీ సభ్యుడు పోడూరి నాగరాజరావు పాల్గొన్నారు.

**ఆచంటలో..**

పెనుగొండ: వృద్ధాప్య దశలో అవ్వాతాతలకు పింఛను పెంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారికి అండగా నిలిచారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం ఆచంటలో జరిగిన కొత్త పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 98 శాతానికి పైగా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, ఆచంట సర్పంచ్ కోట సరోజిని వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు జక్కంశెట్టి చంటి, గణేషుల కృష్ణవేణి, దిరిశాల విజయలక్ష్మీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, సలాది రంగారావు, గణేషుల సుబ్బారావు, కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**అవ్వా, తాతల ఆశీర్వాదమే శ్రీరామరక్ష**

యలమంచిలి: అవ్వా, తాతల ఆశీర్వాదమే జగనన్న ప్రభుత్వానికి శ్రీరామరక్షని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని 32 గ్రామాల్లో కొత్తగా మంజూరైన 350 పింఛన్లను యలమంచిలిలంక గ్రామంలో గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా గడచిన మూడేళ్లలో పింఛన్లు, పింఛన్ సొమ్ము రెట్టింపు అయ్యిందంటే జగనన్నే కారణమన్నారు. కార్యక్రమంలో గుణ్ణం నాగబాబు, పార్టీ మండల కన్వీనర్ పాత్తూరి బుచ్చిరాజు, ఎంపీపీ రావూరి వెంకటరమణ సర్పంచ్ వల్లభు సాయి వెంకట నరసింహారావు, చిలుకూరి సుబ్బారావు, గుర్రాల వెంకట్రావు, రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, జవదాల సువర్ణరాజు, నిమ్మకాయల రామకృష్ణ, గటిగంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**నరసాపురంలో..**

నరసాపురం: కొత్త ఏడాదిలో కొత్తగా లబ్ధిదారులకు పింఛన్‌లు మంజూరు చేయడమే కాకుండా, పింఛన్ మొత్తాన్ని రూ 2750లుకు పెంచడం ద్వారా లబ్ధిదారుల్లో ఆనందం నెలకొందని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు ఏడిద కోటసత్యనారాయణ(వైకేఎస్) అన్నారు. గురువారం పట్టణంలోని 9వ వార్డులో కొత్తగా పింఛన్‌లు మంజూరైన లబ్ధిదారులకు కార్డులు, పింఛన్ మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కస్తూరి ఇందిరాదేవి, తదితరులు ఉన్నారు.

**చింతపర్రులో..**

పాలకొల్లు అర్బన్: వయోభారంతో బాధపడుతున్న అవ్వా, తాతలకు పింఛన్లు మంజూరు చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనవడుగా నిలుస్తున్నారని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అన్నారు. పాలకొల్లు మండలం చింతపర్రులో 31 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు. గ్రామంలో వృద్ధాప్య పింఛన్లు 17, వితంతువు 3, వికలాంగులు 3, చేనేత కార్మికులు 8 మందికి పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, ఉపసర్పంచ్ పెన్మెత్స వెంకట రామకృష్ణంరాజు, వార్డు మెంబర్ చల్లా సాంబయ్య, తాళం రవి, పంచాయతీ కార్యదర్శి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



చింతపర్రులో కొత్తగా మంజూరైన పింఛన్లు ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్న ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి



నరసాపురంలో లబ్ధిదారులకు కొత్త పింఛన్ కార్డు అందిస్తున్న దృశ్యం



పోడూరులో కొత్త లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

### బూత్ కన్వీనర్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సమన్వయంతో పని చేసి తిరిగి జగనన్న అధికారం చేపట్టేలా అంతా అంకితభావంతో పని చేయాలని చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని సీతారాంపురం సౌత్ గ్రామ సర్పంచ్ దొండపాటి వెంకటేశ్వరరావు ఇంటి సమీపంలో సీతారాంపురం నార్త్, సీతారాంపురం సౌత్ సచివాలయాల పరిధిలోని బూత్ కన్వీనర్లు, వలంటీర్లతో ఎమ్మెల్యే ప్రసాదరాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రాధన్యం కలిగిన వారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు సెంట్రల్: వార్షిక మరమ్మతులు, ట్రీ కటింగ్ కారణంగా పాలకొల్లు ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ బి.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ పట్టణంలో రైల్వేగేటు, ప్రభుత్వ ఆసుపత్రి, పెద సాయి బాబా ఆలయం, శ్రీరాంపేట, పార్వతి నగర్, రిజిస్టర్ ఆఫీస్, ఆర్‌టీసీ బస్టాండ్, మారుతి సెంటర్, బ్యాంక్ కాలనీ, నాగరాజు పేట, యడ్లబజారు, రూరల్‌లో దిగమర్రు, కొత్తపేట, పెదమామిడిపల్లి, ఉల్లంపర్రు, వరదనం, లయన్స్ నగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# పార్టీలు, కుల, మతాలకతీతంగా పథకాలు



కాళీపట్నం తూర్పులో బ్రోచర్‌ను అందిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: పార్టీలు, మతాలు, కులాలకతీతంగా నవరత్నాల పథకాలు అందిస్తున్న ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం మండలంలోని కాళీపట్నం పడమరలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందించే లబ్ధిని తెలియచేసే బ్రోచర్‌లను అందించి గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ గ్రామంలో ఇప్పటికే కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కాళీపట్నంలో శిథిలావస్థకు చేరుకున్న వంతెనను తొలగించి రూ.14 కోట్లతో నూతన వంతెన, పాతపాడు వరకూ రహదారి నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. అంతే కాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకన్నా అధికారంలోకి వచ్చిన తరువాత ఎక్కువగానే అమలు చేశారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు అమలు చేసేందుకు కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళీపట్నం తూర్పు, కొత్తోట సర్పంచ్‌లు మేడిది సౌజన్య, పడవల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు తణుకుల శ్రీదుర్గ, లింగం ఏసుబాబు, జెడ్పీటీసీ సభ్యులు తిరుమాని బాపూజీ, బండి ముత్యాలమ్మ ఆలయ చైర్మన్ కొల్లాటి రామారావు, సొసైటీ చైర్మన్ దొంగ నాగముని, నాయకులు కర్రి ఏసు బాబు, తణుకుల వెంకన్న, కవురు పెద్దిరాజు, కొల్లాబత్తుల రవికుమార్, తణుకుల వాసు, జక్కంశెట్టి ఏడుకొండలు, కవురు సుబ్రమణ్యం కవురు ఆదినారాయణ, కవురు సత్యనారాయణ, రేవు నారాయణ మూర్తి, కడలి మధుసూదనరావు, ఆముదాలపల్లి సుబ్రమణ్యం, తన్నీడి గిరి, పోతుల రమేష్,కడలి ఏసు, రేవు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎంతమందితో వచ్చినా చంద్రబాబు గెలవలేడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: పవన్ కళ్యాణ్‌తోపాటు ఎంత మందిని కలుపుకున్నా, ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకుని ఎన్నికల రంగంలోకి దిగినా చంద్రబాబు అధికారంలోకి రాలేదని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ విమర్శించారు. గురువారం తాతాజీ తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు బాబును చూసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భయపడుతున్నారని పిచ్చోడిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కోవిడ్ సమయంలో రాష్ట్ర ప్రజలు ఎలా ఉన్నారో పట్టించుకోకుండా తెలంగాణ రాష్ట్రంలో తలదాచుకున్న మీ బాబు గురించి ప్రగల్భాలు పలకడం మానేయాలని హితబోధ చేశారు. మీరు పేపర్, టీవీ పులులేనని విమర్శించారు. బాబు సభలకు జనం రావడం లేదు కాబట్టే ఇరుకు సందుల్లో సమావేశాలు పెట్టుకుని జనం ఎక్కువ వస్తున్నట్లు మీ ఎల్లో మీడియాలో అంత జనం వచ్చారు, ఇంత జనం వచ్చారని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. నీతులు చెపుతున్న రామానాయుడు అధికారంలో ఉన్నప్పుడు పాలకొల్లు పట్టణంలో 30 యాక్ట్ పేరు చెప్పి ప్రతిపక్షంలో ఉన్న తమను ఏ సమావేశాలు, ధర్నాలు చేయకుండా పోలీసులతో రోడ్లపై ఈడ్చుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినప్పుడు ఏమిచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెన్ను విజయ్, గంటా నరేష్, జోగి వడ్డి కాసులు, బెజ్జవరపు నాగరాజు, షేక్ వల్లీ, పెచ్చెట్టి కృష్ణాజి

# సంక్షేమ పాలనకు మార్గదర్శి సీఎం జగన్



కొడమంచిలిలో గడపగడపకు మన ప్రభుత్వంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలో సంక్షేమ పాలనలో ఆదర్శంగా నిలిచి పాలకుల మార్గదర్శిగా నిలిచారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం ఆచంట మండలం కొడమంచిలి పెదపేట, పెదమల్లంల్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొని లబ్ధిదారులకు అందిన సంక్షేమాన్ని వివరించి, సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రజల ఆకాంక్ష మేరకు సంక్షేమాన్ని అమలు చేస్తూ ప్రజా పరిపాలన చేస్తున్నారన్నారు. దళిత బడుగు బలహీన వర్గాలతోపాటు, అగ్రవర్ణ పేదలకు ఆర్థికంగా నిలబెట్టడానికి సీఎం జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ముఖ్యంగా దళిత వాడల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించాన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కొడమంచిలి పెదపేటలో 100 ఇంటి స్థలాలను ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు కేటాయించామన్నారు. పెదపేటలో డ్రైయినేజీ, సీసీ రోడ్డు నిర్మాణాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, మాజీ చైర్మన్ సుంకర ఇందిర సీతారామ్, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, పెదమల్లం సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యులు చిలుకూరి నాగ దుర్గా భవాని, యల్లమెల్లి బేబీ రాజేష్, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, చింతపర్తి దుర్గ, కుసుమే నారాయణ మూర్తి, దేవస్థానం చైర్మన్ బాలనాగు నరేస్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనరు కొండేటి రమేష్, పోలిశెట్టి వనమరాజు, సాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం



యలమంచిలిలంకలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

యలమంచిలి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని యలమంచిలిలంక గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు గురించి వివరించారు. వలంటీర్ల సేవలు, అధికారుల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అమ్మా జగనన్న పాలన ఎలా ఉంది? గతంలో ఏ ప్రభుత్వమైన ఇంత స్వచ్ఛమైన పాలన అందించిందా? కాబట్టి జగనన్నకు మళ్లీ మీరంతా ఆశీర్వదిస్తే మరింత మెరుగైన జీవితాన్ని మీకు, మీ బిడ్డలకు అందిస్తారని శ్రీనివాస్ చెప్పారు. అనంతరం గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. మరొక రూ.40 లక్షలతో నిర్మించబోయే సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గుణ్ణం నాగబాబు, పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, ఎంపీపీ రావూరి వెంకటరమణ సర్పంచ్ వల్లభు సాయి వెంకట నరసింహారావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు దంపనబోయిన వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు బద్దే రాజభూషణం, జగతాడి గంగరాజు, పెసంగి చిరంజీవి, బోనం బులివెంకన్న, ఉచ్చుల స్టాలిన్, వినుకొండ రవి, కవురు గోపి, పాలంకి శ్రీనివాసరావు, ఇలపకుర్తి నరసింహారావు, గొల్లపల్లి శ్రీనివాసరావు, దొంగ విజయ్‌కుమార్, బొంతు వెంకట కర్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 8 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

భీమవరం (ప్రకాశం చౌక్) : త్యాగరాజ స్వామి 175వ వర్ధంతిని పురస్కరించుకుని త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ అధ్వర్యంలో ఈనెల 8 నుంచి 12 వ తేదీ వరకు 104వ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ కార్యదర్శి కారుమూరి ఆదిత్య, ఉపాధ్యక్షుడు గన్నబత్తుల శ్రీనివాస్ తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో త్యాగరాజ భవనంలోను, 11,12 తేదీల్లో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలోను ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 8వ తేదీ ఉదయం స్వామివారి ఊరేగింపు, సాయంత్రం వేదంతం రామలింగ శాస్త్రి బృందం 20 మందితో నృత్య రూపకం (నర్తనశాల), 9న కాంచన సిస్టర్స్ వారిచే గాత్రం, 10న వివేక్ సదాశివమ్ వారిచే గాత్రం, 11న దివి లిఖిత సాయి మృదంగం విన్యాసం, మేగిలిచర్ల నాగమణి భగవతారణి హరికథ, 12న త్యాగరాజ స్వామివారి పంచరత్న కీర్తనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, చెరుకువాడ వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి



పాలకొల్లులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు కోరారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వ్యవసాయాధికారుల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించడానికి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. దాళ్వా సీజన్‌లో వరి పంట సాగు చేయడానికి అవసరమైన సాగునీరు సరఫరా చేయడానికి ఏ విధమైన ఇబ్బందులు లేవన్నారు. రైతులను చైతన్యవంతం చేసి ప్రతి ఎకరానికీ సాగునీరు అందిస్తామని భరోసా ఇవ్వాలన్నారు. శిక్షణా శిబిరంలో ఏడీఏ ఎ.పార్వతి, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీమ్, పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రోత్సాహకాలు

సాక్షి, భీమవరం : విద్య నేర్పిన పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయడం అభినందనీయమని పీఎస్ఎం పాఠశాల హెచ్ఎం జె.సుధారాణి అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులైన డి చంద్రకళ, మేఖల విశల పాఠశాలను సందర్శించి రూ.16 వేలు విలువ గల బీరువాను పాఠశాలకు బహూకరించారు. అదే విధంగా పాఠశాలలోని మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందచేశారు. కార్యక్రమంలో వీఎం రాధాకృష్ణ, పి.చిట్టి కుమారి, ఎంకే మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

ఉండి: పింఛన్ తీసుకుంటున్న రిటైర్డ్ ఉద్యోగులు, ఫ్యామిలీ పింఛన్‌దారులంతా లైఫ్ సర్టిఫికెట్‌ను సబ్ ట్రెజరీ కార్యాలయంలో గానీ, ఆన్‌లైన్ ద్వారా గానీ అందజేయాలని రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉండి, ఆకివీడు శాఖ ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు గురువారం తెలిపారు.ఉండి ఆకివీడు పరిధిలో మొత్తం 908 మంది రిటైర్డ్ ఉద్యోగులు పింఛన్ తీసుకుంటున్నారని వారంతా నేరుగా సబ్ ట్రెజరీ కార్యాలయానికి వెళ్లి గాని లేదా ఆన్‌లైన్‌లో జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా గాని అందజేయవచ్చన్నారు. సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్ జారీ చేస్తారని, అదే పోస్టాఫీస్, మీసేవ కేంద్రాల ద్వారా సమర్పించేవారు రూ.70 చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

భీమవరం అర్బన్: దాళ్వా వరినాట్లు పూర్తయిన రైతులు తమ పొలాలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ సూచించారు. గురువారం భీమవరం మండలంలోని యనమదుర్రు, గునుపూడి గ్రామాలలోని రైతులకు ఈ క్రాప్ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో సుమారు 11 వేల ఎకరాలలో దాళ్వా సాగుకు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటి వరకు 600 ఎకరాలలో వరినాట్లు పూర్తయ్యాయని, వారందరికి ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. ఆర్‌బీకే సెంటర్లలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉంటారని వారి ద్వారా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు. ఏవో నిమ్మల శ్రీనివాస్ వెంట అగ్రికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.